## నేటి నుంచి కబడ్డీ పోటీలు

కెరమెరి, జనవరి 29 : మండలంలోని సుర్దాపూర్‌లో మంగళవారం కబడ్డీ పోటీలు ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు మడవి దేవ్‌రావ్, రాయిసిడాం సోమేశ్, వల్క జుగాదిరావ్, కుర్సేంగా అను ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి రూ.010,001, ద్వితీయ బహుమతి రూ.6001, తృతీయ బహుమతి రూ.3001 నగదును అందిస్తామన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు రూ.351 ప్రవేశ రుసుము చెల్లించి పోటీల్లో పాల్గొనాలని వారు కోరారు.

## కుష్ఠువ్యాధిపై అవగాహన

దహెగాం,జనవరి29 : మండలంలోని అన్ని గ్రామపంచాయితీల్లో మంగళవారం గాంధీజీ వర్ధంతి సందర్భంగా కుష్ఠువ్యాధిపై అవగాహన కలిపించనున్నట్లు సీహెచ్‌వో సంపత్ తెలిపారు. స్పర్శ్ ప్రోగ్రాంలో భాగంగా గ్రామాల్లో ముందుగా ప్రతిజ్ఞ చేసిన అనంతరం వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కలిపించనున్నట్లు పేర్కొన్నారు.

## వాలీబాల్ కిట్‌లు అందజేత

వాంకిడి,జనవరి 29 : మండలంలోని రాజులగూడలోని యువకులకు 'పోలీస్ మీకోసం' కార్యక్రమంలో భాగంగా ఎస్సై సాగర్ వాలీబాల్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోలీస్ మీకోసం కార్యక్రమంలో భాగంగా సోమవారం సాయంత్రం రాజుల గూడ, గణేష్‌పూర్‌లో వాలీబాల్ కిట్లను అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, గ్రామస్తులు, యువకులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## తైబజార్ ప్లాట్ల వేలం

రెబ్బెన, జనవరి 29: మండలంలోని గంగాపూర్ శివారులో కొలువైన బాలాజీ వేంకటేశ్వరస్వామి జాతర ఫిబ్రవరిలో జరుగనున్న నేపథ్యంలో జాతర తైబజార్ ప్లాట్ల వేలంపాట సోమవారం నిర్వహించినట్లు ఆలయ ప్రత్యేకాధికారి వేణుగోపాల్‌గుప్తా, ఆలయ ఈవో బాపురెడ్డిలు తెలిపారు. ఈ నెల 17న ఆలయంలో కొబ్బరికా యలు, ప్రసాదం విక్రయం, వాహనాల పార్కింగ్, తైబజార్ ప్లాట్లు, కొబ్బరి చిప్పలు కోసం వేలం పాట నిర్వహించగా రూ.18,46,000 లక్షల ఆదాయం వచ్చినట్లు తెలిపారు. తైబజార్ ప్లాట్ల విక్రయం కోసం వేలం పాడిన వ్యక్తి నిర్వహణ తనవల్ల కాదని చెప్పడంతో సోమవారం తైబజార్ ప్లాట్లు విక్రయం కోసం వేలం నిర్వహించగా తొమ్మిది లక్షల ఒక వెయ్యి రూపాయలు పాట పాడి దక్కించుకున్నట్లు పేర్కొన్నారు.


నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★ హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. 9640468899 / 9640258899.

NT-319424-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన

నమస్తే తెలంగాణ

క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679

నిర్మల్: 91827 77671, 91827 77677


# తునికాకు టెండర్లు పిలిచే వరకూ పోరాటం ఆగదు

- టీఏజీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోట శ్రీనివాస్
- ఆదివాసీలు, వామపక్ష సంఘాలతో కలిసి డీఎఫ్‌వో కార్యాలయం ఎదుట ధర్నా

డీఎఫ్‌వో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న వామపక్ష సంఘాల నాయకులు

ఆసిఫాబాద్ టౌన్, జనవరి 29 : జిల్లాలో తునికాకు టెండర్లు పిలిచే వరకు పోరాటం ఆపేది లేదని తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోట శ్రీనివాస్ హెచ్చరించారు జిల్లా కేంద్రంలోని అటవీ శాఖ కార్యాలయం ఎదుట ఆదివాసీలతో కలిసి వామపక్ష సంఘాల ఆధ్వర్యంలో ధర్నానిర్వహించి అనంతరం డీఎఫ్‌ఓ నీరజ్ కుమార్ టిబ్రేవాల్ కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అటవీ శాఖ పేదల పొట్ట గొట్టే ఆలోచన విరమించుకోవాలని, తునికాకు టెండర్లు వెంటనే పిలవాలన్నారు. తునికాకు కూలీలకు పెండింగ్ బోనస్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. తునికాకు సేకరణ వ్యవసాయం తర్వాత రెండో పంటగా అటవీ ప్రాంతంలో ఉందని, ఆకు సేకరణ ద్వారా ఆదివాసీలు ఇతర పేదలు ఉపాధి పొందుతారని జిల్లాలో 30 వేల మంది కూలీలు ఉపాధి పొందుతారని, కూలీలతోపాటు కళ్ళేదారులు గోడౌన్ కార్మికులు, కాంట్రాక్టు కాంట్రాక్టర్లు కూడా ఆదాయం పొందుతారని, ప్రభుత్వానికి కూడా ఎటువంటి ఖర్చు లేకుండా ఆదాయం వస్తుందన్నారు. జిల్లాలోని అటవీ అధికారులు పెద్ద పులులు సంచరిస్తున్నాయని పేరుతో ఈ సీజన్లో తునికాకు యూనిట్లను రద్దు చేయాలని ప్రభుత్వానికి సిఫారసులు చేసిందని ఈ నిర్ణయం వల్ల పేదలు నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో రెండు డివిజన్ల పరిధిలో మొత్తం 25 యూనిట్లు ఉండగా మైనిం గ్, కవాల్ టైగర్ కారిడార్, కడంబ టైగర్ కారిడార్ పేరుతో ఇప్పటికే చాలా యూనిట్లను తగ్గించిన పరిస్థితి ఉందని, తగ్గిన యూనిట్ల పరిధిలో కూలీలు ఉపాధి కోల్పోతున్నారన్నారు. పులుల ఆవాసం 25 యూనిట్ల పరిధిలో లేదని దాని సాకు చూపి పేదల కడుపు కొడితే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. ఇప్పటికైనా అటవీ శాఖ అధికారులు పునరాలోచించాలని, దీనిపై ఎమ్మెల్యేలు స్పందించాలని కోరారు. అదే విధంగా 2016 నుంచి తునికాకు బోనస్ పెండింగ్‌లో ఉందని, ఇంకా 6,300 ల మందికి కోట్ల రూపాయలు రావా ల్సి ఉందని వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశా రు. లేని పక్షంలో పోరాటం ఉధృతం చేస్తామ ని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి కూశన రాజన్న, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షురాలు కొరెంగ మాలశ్రీ, జిల్లా సహాయకార్యదర్శి నల్లి దామోదర్, తునికాకు కళ్లేదారుల సంఘం అధ్యక్షుడు చన్కపురి కాశీనాథ్, నాయకులు కమలాకర్, మడే శైలేష్, దిగిడ శ్రీనివాస్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్, జిల్లా అధ్యక్షుడు గేడం టికానంద్, జిల్లా కోశాధికారి దుర్గం రాజ్‌కుమార్, సీఐటీయూ జిల్లా నాయకులు ముంజం ఆనంద్‌కుమార్ తునికాకు కూలీలు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

- అదనపు కలెక్టర్ దాసరి వేణు

అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ దాసరి వేణు

ఆసిఫాబద్ టౌన్, జనవరి 29: ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి సంబంధిత అధికారుల సమన్వయంతో కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ దాసరి వేణు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో డీఆర్‌వో సురేశ్‌తో కలిపి అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. జిల్లాలోని ఈదులవాడ ప్రాంతానికి చెందిన మారిశెట్టి రామ్మూర్తి తాను గ్రామ శివారులో భూమిని రిజిస్ట్రేషన్ ద్వారా కొనుగోలు చేసి ధరణిలో మూటేషన్ చేయించుకున్నానని, కానీ తన పేరుకు బదులు వేరొకరి పేరు వచ్చిందని సవరించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఆసిఫాబాద్ మండలం జనకాపూర్ గ్రామానికి చెందిన ఒడ్డే పేటన్న తన తండ్రి ప్రభుత్వ కార్యాలయంలో వాచ్‌మెన్ గా విధులు నిర్వహిస్తూ మృతి చెందారని, ఇంటికి పెద్ద కుమారుడు అయిన తనకు ఇట్టి ఉద్యోగం ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. కౌటాల మండలం గుడ్లబోరి గ్రామ సర్పంచ్ పాలే రాందాస్ తనకు 14 నెలల జీతం రావాలసి ఉందని ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. జిల్లాకు చెందిన ఏ. శ్రీనివాస్ తాను గత రెండు ఏండ్లుగా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో దోబీగా విధులు నిర్వహిస్తున్నానని, ప్రస్తుతం తనను తొలగించారని, తిరిగి అవకాశం కల్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. దహెగాం మండల కేంద్రానికి చెందిన నల్ల దామోదర్ తనకు కమ్మరపల్లి గ్రామ శివారులో గల భూమిలో గిరి వికాస్ పథకం కింద 2 సంవత్సరాల క్రితం బోరు వేశానని, విద్యుత్ కనెక్షన్ ఇప్పించి ఆదుకోవాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాల బాలికల వసతిగృహం నైట్ వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న నైతం సులోచన తాను 8 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నానని, తన ఉద్యోగంలో ఏర్పడిన సమస్యను పరిష్కరించి న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కాగజ్‌నగర్ పట్టణంలోని నజ్రులనగర్‌కు చెందిన కృష్ణ మండల్ తనకు నజ్రుల్ నగర్‌లో భూమి ఉందని, నూతన పట్టా పాసుపుస్తకం మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారుల సమన్వయంతో పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పరిశుభ్రత పాటించాలి

జైనూర్, జనవరి 29: ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని జైనూర్ గ్రామపంచాయతీ ఈవో శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో గ్రామపంచాయతీ కార్మికులతో కలిసి వివిధ కాలనీలలో ఉన్న గడ్డి, ప్లాస్టిక్ కవర్స్‌ను ఏరి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామ ప్రజలకు పరిశుభ్రత పై అవగాహన కల్పించారు. విషజ్వరాలు ప్రభలకుండా ప్రజలు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఈవో సూచించారు. పంచాయతీ కార్మికులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఒకరి రిమాండ్

దహెగాం,జనవరి29: మండలంలోని కమ్మర్‌పల్లి గ్రామానికి చెందిన నేరెల్ల దత్తాత్రేయను సోమవారం రిమాండ్ చేసి జైలుకు తరలించినట్లు ఎస్ఐ సనత్‌కుమార్ తెలిపారు.ఆయన తెలిపిన ప్రకారం.. ఈ నెల 24న నేరెళ్ల జ్యోష్ణపై తన భర్త అయిన దత్తాత్రేయ మద్యం తాగి గొడవ పడుతుండడంతో 100 నంబర్‌కు సమాచారం అందించారు. వెంటనే బ్లూకోట్ కానిస్టేబుల్ సంతోష్ అక్కడికి చేరుకొని సమాచారం తెలుసుకునే క్రమంలోనే దత్తాత్రేయ కానిస్టేబుల్‌పై దురుసుగా ప్రవర్తిస్తూ ప్రభుత్వ ద్విచక్ర వాహనాన్ని ధ్వంసం చేశాడు. కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి సోమవారం కోర్టులో హాజరు పర్చి కోర్టు ఆదేశాలతోనాన్‌బెయిలేబుల్ కేసులో జైలుకు తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

## క్యాలెండర్ ఆవిష్కరణ

సిర్పూర్(టీ), జనవరి 29 : మండలకేంద్రంలోని జడ్పీ పాఠశాల ఆవరణలో సోమవారం పీఆర్టీయూ వార్షిక క్యాలెండర్‌ను జడ్పీ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు సదాశివుడు ఉపాధ్యాయులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో త్వరలో 317 బాధిత ఉపాధ్యాయులకు న్యాయం జరగడంతో పాటు సీపీఎస్ రద్దు, సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఎమ్‌టీఎస్, తదితర సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి, మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, ఎక్జిక్యూటీవ్ సభ్యులు షేక్ రహీమ్, రాంటెంకి విఠల్, మహేశ్, ఉపాధ్యాయులు, సీఆర్పీ పవన్, సీసీవో ప్రకాశ్, పాల్గొన్నారు.

# సమ్మెపై కదిలిన వివిధ కార్మిక సంఘాలు

జిల్లా వైద్యాధికారికి సమ్మె నోటీస్ ఇస్తున్న ఆశ కార్యకర్తలు , సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు

ఆసిఫాబాద్ టౌన్, జనవరి29: కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ డిమాండ్ల పరిష్కారం కోసం అన్ని కార్మిక సంఘాలు ఐక్యంగా ఫిబ్రవరి 16 చెపట్టనున్న సమ్మెను విజయవంతం చేయాలంటూ సీఐటీయూ, ఏఐటీయూసీ లతోపాటు వాటి అనుబంధ సంఘాల ఆయా విభాగాల బాధ్యులకు సమ్మె నోటీసు అందజేశాయి.

**● సమ్మె వాల్ పోస్టర్ విడుదల**

ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 16న జరిగే ఆల్ ఇండియా సమ్మె పోస్టర్ జిల్లా కేంద్రంలోని హమాలీ కార్మికులతో కలిసి మార్కెట్‌యార్డ్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత్ వెలిగిపోతుందంటూ బీజేపీ అబద్ధపు ప్రచారాలు చేస్తుందని, కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గడిచిన పదేళ్లలో ఎన్నో రకాల కష్టాలు అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం మేల్కోవాలని హితవు పలికారు. ప్రతి ఒక్కరూ సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. ఈసమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు టి.దివాకర్, ఉపాధ్యక్షుడు పిడుగు శంకర్, రెబ్బెన మండలాధ్యక్షుడు అరికిల్ల స్వామి, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆత్మకూరి చిరంజీవి, కార్మికులు శ్రీనివాస్, దివాకర్, మోహన్, కొమురక్క, ప్రకాశ్, తిరుపతి, సురేశ్ పాల్గొన్నారు.

**● డీఎంఎచ్‌వోకు ఆశ వర్కర్ల నోటీసు**

జిల్లా వైద్యాధికారి తుకారాం బట్‌కు ఆశ వర్కర్లు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ అధ్యక్షతన సమ్మె నోటీస్ అందజేశారు. ఆశ వర్కర్లు సమ్మెలో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు స్వరూప, జిల్లా కార్యదర్శి పద్మ, నాయకులు సుజాత, భాగ్య, భారతి, సక్కుబాయి, లలిత, స్వరూప, సుమలత పాల్గొన్నారు.

**● మధ్యాహ్న భోజన కార్మికులు..**

మధ్యాహ్న భోజన కార్మికులు జిల్లా విద్యాధికారి కార్యాలయంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు కృష్ణమాచారి ఆధ్వర్యంలో సమ్మె నోటీస్ అందజేశారు. దేశంలో అధికారంలో ఉన్న బీజేపీకి కనువిప్పు కలిగే విధంగా సమ్మె ఉంటుందని ఆయన హెచ్చరించారు. సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం పూనుకోవాలని డిమాండ్ చేశారు.

# విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

అదనపు కలెక్టర్ వేణుకు వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఆసిఫాబాద్ టౌన్,జనవరి 29 : విద్యారంగంలోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు షేక్ జాఫర్ జిల్లా అడిషనల్ కలెక్టర్ వేణుకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగంలో అనేక సమస్యలు ఉన్నాయన్నారు. నూతనంగా ఏర్పడిన మండలాల్లో ప్రభుత్వ కళాశాలలు లేకపోవడంతో ఇతర మండలాలకు వెళ్లి చదువుకోవడానికి పేద విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే కొత్త కళాశాలలు మంజూరు చేయాలన్నారు. దాదాపు రూ.5,800 కోట్ల పెండింగ్ స్కాలర్‌షిఫ్ విడుదల చేయాలన్నారు. అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న వసతి గృహాలకు సొంత భవనాలు ఏర్పాటు చేయాలని, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలని, పది, ఇంటర్ విద్యార్థులకు స్పెషల్ మెనూ అందించాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ చార్జీలు పెండింగ్ డైట్ బిల్లులు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వసాకేసాయి, జిల్లా కమిటీ సభ్యులు నితీశ్, నవీన్ పాల్గొన్నారు.

## జంతు సంక్షేమం కోసం నిబంధనలు పాటించాలి

ఆసిఫాబాద్ టౌన్,జనవరి 29: జంతు సంక్షేమం కోసం ప్రతి పౌరుడు నిబంధనలను పాటించాలని కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవనంలో గల జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో రాష్ట్ర జంతు సంక్షేమ సంస్థ-పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సిద్ధం చేసిన గోడప్రతులను జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి సురేష్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. జంతువుల సంక్షేమం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. అడవులు, సరస్సులు, నదులు, వన్యప్రాణులతో సహజ పర్యావరణాన్ని రక్షించాలని, జీవుల పట్ల కరుణ కలిగి ఉండాలని తెలిపారు. పశువులు, ఇతర జంతువులు, పక్షులను నిబంధనల మేరకు తరలించాలని, అక్రమ రవాణాకు పాల్పడితే శిక్షార్హులని, ఆవులు, దూడలను వధించడం నిషేధించామన్నారు. వీధి కుక్కలు, పిల్లుల సంతాన నియంత్రణ శస్త్రచికిత్సలు చేసేందుకు మున్సిపల్ , జంతు సంరక్షణ సంస్థలు విధిగా జాతీయ జంతు కల్యాణ మండలి గుర్తింపు, అనుమతి పొందాలని, జంతువుల అక్రమ రవాణా, అక్రమ వధ, జంతు సంరక్షణ కేంద్రాలలో హింసకు గురైన జంతువులు, పక్షులను సంబంధిత ప్రభుత్వ అధికారులు వాటిని సంరక్షణ కేంద్రాలకు పంపించేప్పుడు నిబంధనల మేరకు అర్హత కలిగిన సంస్థలకే ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## చుక్కల దుంపిని చంపిన నిందితులకు రిమాండ్

సిర్పూర్(టీ), జనవరి 29 : సిర్పూర్(టీ) అటవీ శాఖ రేంజ్ పరిధిలోని చీలపల్లి అటవీప్రాంతంలో శుక్రవారం చుక్కల దుప్పిని హతమార్చిన నిందితులకు సోమవారం సిర్పూర్(టీ) జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించినట్లు సిర్పూర్(టీ) అటవీ శాఖ రేంజ్ అధికారి పూర్ణచందర్‌రావు పేర్కొన్నారు. ఆయన తెలిపిన ప్రకారం.. శుక్రవారం చీలపల్లి అటవీ ప్రాంతంలో మండలకేంద్రానికి చెందిన ఎండీ శాకీర్, దుర్గం సునీల్, దుర్గంసాయి, చెర్ల రాహుల్‌లు చుక్కల దుప్పిని చంపి, మాంసాన్ని తరలిస్తుండగా నిందితులను పట్టుకున్నట్లు తెలిపారు. అందులో ప్రధాన నిందితుడు ఎండీ శాకీర్ పరారీలో ఉండగా, మిగతా ముగ్గురిని విచారించి, సోమవారం సిర్పూర్(టీ) జూనియర్ సివిల్ కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు. ఈ మేరకు జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి నిందితులకు 14 రోజుల రిమాండ్ విధించినట్లు పేర్కొన్నారు. దీంతో ముగ్గురిని ఆసిఫాబాద్ జైలుకు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు.

## ఉద్యోగ అవకాశాలను సద్వినియోగించుకోవాలి

ఆసిఫాబాద్ టౌన్, జనవరి29: యువత అందివచ్చిన ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పనాధికారి రవికృష్ణ అన్నారు. జిల్లా కేంద్రంలోని పీఎంకేకే కార్యాలయంలో కృషి విజ్ఞాన్ సొసైటీలో సేల్స్ ఎగ్జిక్యూటివ్, ఫీల్డ్ ఆఫీసర్, హెచ్‌ఆర్, ఆఫీస్ బాయ్ లాంటి నాలుగు రకాల 67 ప్రైవేటు ఉద్యోగ ఖాళీలకు నిర్వహించిన జాబ్ మేళాలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జాబ్ మేళాకు 47 మంది హాజరు కాగా దీని ద్వారా 13 మందిని ఎంపిక చేసినట్లు వివరించారు.

## హత్య కేసులో ఒకరికి ఏడేండ్ల జైలు

ఆసిఫాబాద్ టౌన్,జనవరి29: హత్య చేసిన కేసులో నిందితుడికి ఏడు సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ సోమవారం ఆసిఫాబాద్ జిల్లా సెషన్స్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్ తీర్పునిచ్చారు.కోర్టు లైజనింగ్ ఆఫీసర్ ఎస్ఐ కే.సాగర్, కాగజ్‌నగర్ సబ్ డివిజన్ లైజనింగ్ ఆఫీసర్ బాబాజీ (హెడ్ కానిస్టేబుల్) తెలిపిన ప్రకారం.. 2022 సంవత్సరంలో కాగజ్‌నగర్ గుంటూరు కాలనీకి చెందిన మునిగల సదానందంపై కాగజ్‌నగర్ సర్‌సిల్క్ కాలనీకి చెందిన ఉయ్యాల గోపి హత్య చేసిన నేరంపై కేసు నమోదు కాగా, పీపీ జగన్ మోహన్‌రావు కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టగా విచారణ అనంతరం హత్యా నేరం రుజువు కావడంతో నేరస్తుడు ఉయ్యాల గోపికి ఐపీసీ సెక్షన్ 302 ప్రకారం 7 సంవత్సరాల జైలు శిక్ష విధించారు.హత్య కేసులో నిందితుడికి శిక్ష పడేలా కృషిచేసిన పోలీస్ అధికారులు, కోర్టు సిబ్బందిని ఎస్పీ కే.సురేశ్‌కుమార్ అభినందించారు.

## బాధితులకు పరిహారం అందజేత

ఆసిఫాబాద్ టౌన్, జనవరి 29 : అడవి పంది దాడిలో మృతి చెందిన కౌటాల మండలం ముత్యంపేట గ్రామానికి చెందిన మోర్లే గౌరబాయి కుమారుడు గణపతికి సిర్పూర్ ఎమ్మెల్యే హరీశ్‌బాబు, జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్ కుమార్ టిబ్రీవాల్ తో కలిసి పరిహారం చెక్కు జిల్లా కేంద్రంలో అందజేశారు. బాధితులకు 2,50,000 చెక్కు రూపంలో, 2,50,000 రూపాయలు బాండ్ రూపంలో అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిర్పూర్ ఎఫ్ఆర్‌వో పూర్ణచందర్, కౌటాల ఎఫ్‌బీవో ప్రభాకర్ సర్పంచ్ శ్రీనివాస్, వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

## బడీడు పిల్లలను పనిలో పెట్టొద్దు

బెజ్జూర్, జనవరి 29 : బడీడు పిల్లలను పనిలో పెట్టుకోవద్దని కాగజ్‌నగర్ డివిజన్ ఎస్ఐ గంగన్న అన్నారు. సోమవారం ఆపరేషన్ స్మైల్‌లో భాగంగా మండల కేంద్రంలోని ఆయా షాపులను సందర్శించారు. ఈ సందర్భంగా షాపుల యజమానులకు అవగాహన కల్పించారు. బాల్యం అనేది పిల్లల హక్కని, బాల్యంలో పిల్లలను బడిలోకే పంపించాలని వారు సూచించారు. కార్యక్రమంలో ప్రొటెక్షన్ అధికారి శ్రీమతి, లీగల్ అడ్వకేట్ శ్రీనివాస్, చైల్డ్ కౌన్సిలర్ రవళి, పోలీసు సిబ్బంది రూప్‌సింగ్ , రజిని, షాపుల యజమానులు, స్థానిక యువకులు తదితరులు పాల్గొన్నారు.

## అధికారులు సమన్వయంతో పని చేయాలి

ఆసిఫాబాద్ టౌన్,జనవరి 29: ప్రధానమంత్రి జన్ మన్ పథకం కింద జిల్లాలోని పీవీటీజీల అభివృద్ధికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సమావేశం మందిరంలో జిల్లా రెవెన్యూ అధికారి సురేశ్‌తో కలిసి జిల్లా పరిషత్, గ్రామీణ అభివృద్ధి, పంచాయితీ, మిషన్ భగీరథ, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, గిరిజన సంక్షేమ, విద్యుత్ శాఖలు, బ్యాంకు అధికారులతో ప్రధానమంత్రి జన్ మన్ పథకం నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.ప్రధానమంత్రి జన్ మన్ పథకం కింద పీవీటీజీల కుటుంబాల్లో ప్రతి సభ్యుడికి జన్ ధన్ బ్యాంకు ఖాతాలు తెరిపించాలన్నారు. మహిళలకు స్త్రీ నిధి రుణాలు అందించాలని, ప్రధానమంత్రి కిసాన్ ద్వారా అర్హులందరికీ కార్డులు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సురేశ్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

రెబ్బెన, జనవరి 29: మండలంలోని రాంపూర్ దగ్గర సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వెంకటేశ్ కు తీవ్ర గాయాలైనట్లు ఎస్ఐ చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఎస్ఐ తెలిపిన ప్రకారం... సిర్పూర్(టీ) గ్రామానికి చెందిన వెంకటేశ్(30) డ్రైవర్‌గా పని చేస్తూ జీవిస్తున్నాడు. సోమవారం వెంకటేశ్ వ్యక్తిగత పని నిమిత్తం సిర్పూర్(టీ) నుంచి మంచిర్యాలకు టీఎస్ 20టీ 3594 నంబర్ గల ఆటోలో బయలు దేరి వెళ్తున్నాడు. కాగజ్‌నగర్ దాటిన తర్వాత రెబ్బెన మండలంలోని రాంపూర్ శివారులో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో వెంకటేశ్‌కు తీవ్ర గాయాలు కాగా గమనించిన స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. 108 అంబులెన్స్‌లో కాగజ్‌నగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించి అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం మంచిర్యాల ప్రభుత్వ దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. అదే గ్రామానికి చెందిన దుర్గం ప్రవీణ్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

# తక్కువ ఖర్చు.. ఎక్కువ దిగుబడి

- డ్రమ్‌సీడర్ వరిసాగుపై రైతుల మొగ్గు
- నాటేసే కూలీల ఖర్చుతో పంట మొత్తం పెట్టుబడి
- జాగ్రత్తలు పాటిస్తే రైతుకు మేలు

డ్రమ్ సీడర్‌తో విత్తనాలు విత్తుతున్న రైతు

ఏపుగా పెరుగుతున్న డ్రమ్ సీడర్‌తో సాగు చేసిన వరి

పెంచికల్‌పేట్,జనవరి 29: రాష్ట్రంలో ఎక్కువ శాతం రైతులు వరి సాగుచేస్తూ అధిక దిగుబడులు వచ్చే పంటలు వేసి లాభసాటి వ్యవసాయం చేస్తున్నారు. కూలీల కొరత, అధిక కూలీ రేట్లు ప్రత్యామ్నాయం వైపు చూస్తున్న నేపథ్యంలో కేసీఆర్ ప్రభుత్వం రైతులకు డ్రమ్ సీడర్ యంత్రంపై రైతు వేదికల్లో వ్యవసాయాధికారుల ద్వారా రైతులకు విస్తృతస్థాయి అవగాహన, డెమో క్లాసులను నిర్వహించారు. చైతన్యం చెందిన కొందరు రైతులు యంత్రాన్ని వినియోగిస్తున్నారు. పెరిగిన కూలీల రేట్లు, కొరతతో పెంచికల్‌పేట్ మండలంలో యాసంగి పంట వరిసాగు 520 ఎకరాల్లో 40 శాతం రైతులు డ్రమ్‌సీడర్ వరిసాగులో నిమగ్నమయ్యారు. ఒక ఎకరానికి సన్నరకం 6 కేజీలు, దొడ్డు రకం 10 కేజీల విత్తనాలు నానబెట్టుకొని పొట్ట పగిలిన దశలో విత్తుకోవాలి. ముందుగా పొలం రోటవేటర్ ద్వారా దుక్కిపెట్టుకొని ఒకసారి దమ్ము చేయాలి. తర్వాత నీళ్లు కట్టుకొని విత్తనాలు విత్తుకునే ఒకరోజు ముందు జంబుతో మరోసారి దన్ను చేసుకోవాలి. విత్తనాలు పొట్ట పగిలే దశ వరకు నానబెట్టుకొని డ్రమ్‌సీడర్ యంత్రం ద్వారా విత్తనాలను విత్తుకోవాలి. వరి మొలకెత్తిన 20 రోజుల తర్వాత గడ్డి మందు పిచికారీ చేసుకోవాలి. మోతాదుకు మించకుండా ఎరువులు, మందులను వాడుకోవాలి. పది ఎకరాల వరి పొలం సాగు చేసే రైతు కూలీల ద్వారా నాటేసే ఖర్చు రూ.50 వేలు అవుతుంది. కానీ డ్రమ్ సీడర్ యంత్రం ద్వారా ఇద్దరు కూలీలతో 5 రోజుల్లో 5వేల ఖర్చుతో పూర్తి అవుతుంది. మిగిలిన డబ్బులు పంట చేతికొచ్చే వరకు ఎరువులు, పైమందులు, పంటకోతకు వినియోగించుకోవచ్చు. డ్రమ్‌సీడర్ యంత్రంతో తక్కువ ఖర్చుతో వరి సాగు చేసి ఎక్కువ దిగుబడి పొందవచ్చు. కూలీల ద్వారా పొలం నాటేస్తే వచ్చే దిగుబడి కంటే ఒక ఎకరాకు 3 నుంచి 5 క్వింటాళ్ల వరకు పం ట దిగుబడి వస్తున్నాయని గత సంవత్సరం నుంచి సాగు చేస్తున్న రైతులు చెబుతున్నారు. రైతులు అధికారుల సూచనలు, సలహాలు పాటిస్తే అధిక దిగుబడులను పొందవచ్చని పేర్కొంటున్నారు.

### కూలీల కొరత తీరింది

యాసంగి వరి సమయంలో పత్తి, మిర్చి పంటలు చేతికి రావడంతో వరి నాటేసే కూలీల కొరత రైతులను వేధిస్తున్నది. మరోవైపు కూలి రేటు పెరగడంతో రైతులకు తిప్పలు తప్ప డం లేదు. కొత్తగా అందుబాటులోకి వచ్చిన డ్రమ్ సీడర్ యంత్రం ఉపయోగించి వరి విత్తనాలు విత్తుతున్నాం. దీంతో కూలీలలు లోటు తీరింది.

-సద్మేక చంద్రయ్య రైతు

### తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి

సంవత్సరం నుంచి డ్రమ్‌సీడర్ యంత్రం ద్వారా 5.5 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నా. నాటేసే కూలీలతో అయితే రూ. 27,500 ఖర్చు అవుతుంది. డ్రమ్ సీడర్ యంత్రంతో రూ.3000 ఖర్చుతో విత్తనాలు విత్తుతున్నా. ఒక ఎకరాకు 5 క్విం టాళ్ల అధిక దిగుబడి వస్తున్నది.

-ఆత్రం తులసీరాం, రైతు

### జాగ్రత్తలు పాటిస్తే రైతులకు మేలు

డ్రమ్ సీడర్‌ను ఉపయోగించి వరి సాగు చేస్తున్న రైతులు విత్తనాల దశ నుంచి పంట కోత వరకు అధికారులను సంప్రదించి విత్తనాల కొనుగోలు ఎరువులు పైమందుల వాడకం వరకు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు పొందుతారు. వ్యవసాయ సందేహాలకు ఏవో కార్యాలయంలో సంప్రదించాలి.

-రాజుల నాయుడు,వ్యవసాయ అధికారి పెంచికల్‌పేట్